

సోమశిలలో 7.29 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారానికి 7.296 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు) రూ.75,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము) రూ.6,726
మూడు శాతం జీఎస్టీతో రూ.6,928
సవర (8 గ్రాములు) రూ.55,424



చిరుధాన్యాలతో ఆరోగ్యం

మారుతున్న జీవన శైలి కారణంగా చిరుధాన్యాలవైపు ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ తరుణంలో వీటి విక్రయాలు పెరుగుతున్నాయి. 8లో







కేవీఆర్ పెట్రోల్ బంక్ సెంటర్‌లో జోరుగా కురుస్తున్న వర్షం

వర్షంతో ఖుషీఖుషీ

ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. దాదాపు గంటపాటు కురిసిన వర్షంతో నెల్లూరు నగరంలో వాతావరణం చల్లబడింది. – సాక్షి ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు అండగా..

• ప్రత్యేక కమిటీల ఏర్పాటు



విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు అండగా నిలిచేందుకు ప్రత్యేక కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం ఏర్పాటు చేసింది. ప్రతి కార్యకర్త, అక్కచెల్లెమ్మలు, సోషల్ మీడియా వారికి ఈ కమిటీలు తోడుగా నిలుస్తాయి. బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా వారికి న్యాయ, వైద్యపరంగా ఆర్థికంగా సహాయ, సహకారాలను అందించనున్నాయి. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బుర్రా మధుసూదన్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డిని నియమించారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.331

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు గరిష్ట ధర రూ.331 గురువారం లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 952 బేళ్లను విక్రయానికి తీసుకురాగా, 861 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 91 బేళ్లను తిరస్కరించారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడారు. కనిష్ట ధర రూ.205.. సరాసరిగా రూ.282.30 లభించిందని వివరించారు. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 731 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 731 బేళ్లను విక్రయించారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 774 బేళ్లు రాగా, 731 బేళ్లను విక్రయించారని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. వేలంలో 88,052 కిలోల పొగాకును విక్రయించగా, రూ.2,40,04,080 వ్యాపారం జరిగిందని వివరించారు. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.331 కాగా.. కనిష్ట ధర రూ.204 లభించిందని చెప్పారు. సగటు ధర రూ.272.61గా నమోదైందని, వేలంలో 23 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

నర్రవాడలో వేలం నేడు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలో ఈ నెల 23 నుంచి నిర్వహించనున్న వెంగమాంబ బ్రహ్మోత్సవాల్లో వివిధ ఏర్పాట్లకు సంబంధించిన వేలం, టెండర్లను దేవస్థాన కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించనున్నామని ఈఓ ఉషశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానంలో రంగులేయడం, ఫొటోలు, వీడియోలు తీయడం, ఆల్బమ్ తయారీకి సంబంధించిన వేలాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. దేవస్థాన స్థలంలో ఏర్పాటు చేసే తాత్కాలిక అంగళ్లకు బాడుగ వసూలు చేసుకునేందుకు సీల్డ్ టెండర్ లేని పక్షంలో బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఆటోనగర్‌లో గల ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనార్టీ బాలురు)లో 2024 – 25 విద్యా సంవత్సరంలో ఐదు నుంచి 8వ తరగతి వరకు చేరబోయే మైనార్టీ విద్యార్థులకు ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామని ప్రిన్సిపల్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్ విద్యార్థులకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాన్ని కల్పించనున్నామని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు పాఠశాలకు ఈ నెల 12లోపు స్వయంగా వచ్చి దరఖాస్తులను అందజేయాలని కోరారు. వివరాలకు 87126 25045 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పదో తరగతి సప్లిమెంటరీ మూల్యాంకనం ప్రారంభం

నెల్లూరు(బృందావనం): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనాన్ని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించామని డీఈఓ రామారావు తెలిపారు. జిల్లాకు 7224 జవాబు పత్రాలు వచ్చాయని, వీటి మూల్యాంకనానికి 188 మంది సిబ్బందిని నియమించామని చెప్పారు. మూడు రోజుల్లో ప్రక్రియ ముగియనుందన్నారు. మ్యాథ్స్ జవాబుపత్రాలను ఇతర జిల్లాలకు పంపించి స్కాన్ చేయించామని, ఈసారి వీటి మూల్యాంకనాన్ని ఆన్‌లైన్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి అన్ని పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్లో మూల్యాంకనం చేయనున్నామని పేర్కొన్నారు.

వామ్మో.. ఏమిటీ మోత..?

కాలుష్యం అంటే దట్టమైన పొగ.. రసాయన వాసనలే సాధారణంగా గుర్తొస్తాయి. అయితే మనకు తెలియకుండానే చాపకింద నీరులా మరో కాలుష్యం నానాటికీ తీవ్రమవుతోంది. శబ్ద కాలుష్యం ఎక్కువవుతూ ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తోంది. చాలా మంది వాహనం ఎక్కారంటే అవసరం లేకపోయినా హారన్‌ను తెగ మోగిస్తుంటారు. దీని ద్వారా రణగొణుల తీవ్రత మరింత పెరుగుతోందని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తన అధ్యయనంలో వెల్లడించింది. నగరవాసులు అప్రమత్తమై మార్పు దిశగా అడుగులేయాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

• నగరంలో పెరుగుతున్న శబ్ద హోరు
• హారన్లతో సమస్య తీవ్రం
• ఎక్కువవుతున్న వ్యక్తిగత వాహనాలు
• ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరు నగరంలో శబ్ద హోరు రోజురోజుకూ తీవ్రమవుతోంది. వాహనాలు ఎక్కువవుతుండటం.. తొందరగా వెళ్లాలనే ఆత్రుత.. ఇలా అవసరం లేకపోయినా హారన్‌ను మోగిస్తుండటం సర్వసాధారణమైపోయింది. దీనికి సంబంధించి గతంలో ఓ సర్వేను నిర్వహించారు. రద్దీ ఎక్కువగా ఉండే ఉదయం 9.30 నుంచి 10.30 వరకు.. సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల వరకు శబ్ద తీవ్రతను ఎనిమిది పాయింట్లలో నమోదు చేశారు. ఒక్క నిమిషంలో వాహనదారులు హారన్‌ను ఎన్నిసార్లు కొడుతున్నారో గుర్తించారు. 50 శాతం శబ్ద కాలుష్యానికి వాహనాలే కారణమనే అంశాన్ని అధ్యయనంలో తేల్చారు. హారన్ మోతతోనే రెండు నుంచి ఐదు డెసిబెల్ల వరకు శబ్ద తీవ్రత అధికంగా నమోదవుతోందని తేలింది.

ప్రవర్తనపై పెను ప్రభావం

చికాకు, కోపం, ఆందోళనకు శబ్ద కాలుష్యం కారణమవుతోంది. ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మితిమీరిన హారన్లతో వాహనాలు నడిపేటప్పుడు ఏకాగ్రత తగ్గి ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి.

వాహనాల సంఖ్య డబుల్

నెల్లూరు జనాభా 2004లో 4,04,775 ఉండగా.. 2009 నాటికి 5,58,547 చేరింది. ప్రస్తుతం దాదాపు ఎనిమిది లక్షలకుపైగా జనాభా ఉన్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య నానాటికీ ఎక్కువవుతోంది. నాలుగేళ్ల వ్యవధిలోనే రవాణా వాహనాల సంఖ్య దాదాపు లక్షకుపైగా చేరుకుంది. ఇందులో ద్విచక్రవాహనాలే 1.45 లక్షల వరకు ఉన్నాయి. కార్ల సంఖ్య 21,987.. ఆటోల సంఖ్య 29,413గా నమోదైంది. ఈ తరుణంలో ఇంటికి కనీసం రెండు వాహనాలైనా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. రానున్న కొన్నేళ్లలో వాహనాల సంఖ్య జనాభా సంఖ్యను దాటే అవకాశం ఉందని ఇటీవల జరిపిన పలు సర్వేల్లో తేలింది. మరోవైపు మ్యూజిక్ హారన్లు, ఇతర హారన్లతో రెండు నుంచి మూడు డెసిబెల్ల శబ్ద తీవ్రత పెరుగుతోంది. వీటికి దూరంగా ఉండాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

నిర్దేశిత శబ్ద పరిమితులు (డెసిబెల్స్‌లో)

విభాగం	పగలు	రాత్రి
నివాస	55	45
వాణిజ్య	65	55
పారిశ్రామిక	75	70
సున్నిత ప్రాంతం	50	40

శబ్ద కాలుష్యంతో అనేక అనర్థాలు

శబ్ద కాలుష్యంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది రోజురోజుకూ ఎక్కువవుతోంది. సాధారణంగా మనుషులు 15 డెసిబెల్ల లోపు శబ్దాన్ని వినగలరు. 25 దాటితే అకస్మాత్తుగా వినికిడి లోపం వచ్చే అవకాశం ఉంది. ముక్కు సంబంధిత సమస్యలతో పాటు ఒత్తిడితో కూడిన అనారోగ్యం, బీపీ, నిద్రలేమి లాంటివి వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. పెద్ద శబ్దాలు చేసే హారన్లు, సైలెన్సర్లను వాహనాలకు వాడకూడదు.
– శ్రీదేవి, ఈఎన్టీ స్పెషలిస్ట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

అధికారులు చర్యలు చేపట్టాలి

అకస్మాత్తుగా వినిపించే పెద్ద శబ్దాలతో తలనొప్పి వస్తుంది. కొంత మంది ద్విచక్ర వాహనాల్లో పెద్ద శబ్దాలొచ్చే సైలెన్సర్లను వినియోగిస్తున్నారు. శబ్ద కాలుష్యాన్ని అరికట్టాలి. దీనికి ఆర్టీఏ అధికారులు, పోలీసులు తగు చర్యలు చేపట్టాలి.
– దేవరకొండ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్, బుజబుజనెల్లూరు

జిల్లాలో ఎన్నికల కోడ్ ఆంక్షల తొలగింపు

• కలెక్టర్ హరినారాయణన్



నెల్లూరు(దర్గామిట్ట): ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగియడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ గురువారం సాయంత్రంతో తొలగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు సహకరించిన ఆర్వోలు, అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులకు కృతజ్ఞతలను తెలియజేశారు. ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేశామని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును నిర్వహించారని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేశామన్నారు.

కండలేరులో 6.58 టీఎంసీల నీరు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.582 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

10న క్రికెట్ జట్ల ఎంపిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గల క్రికెట్ ప్రాంగణంలో అండర్ – 16 జిల్లా క్రికెట్ జట్లను ఈ నెల పదిన ఎంపిక చేయనున్నామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ సొంత కిట్లు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, డ్రస్ కోడ్‌లో హాజరుకావాలని కోరారు.

నిమ్మ ధరలు ఆశాజనకం

పొదలకూరు: నిమ్మ ధరలు వారం రోజులుగా పెరుగుతున్నాయి. తోటల నుంచి దిగుబడి తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు వెల్లడించారు. మార్కెట్లో కిలో నిమ్మ ధరలు రూ.40 నుంచి రూ.77 వరకు ప్రస్తుతం పలుకుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు సైతం తగ్గుతున్నాయి. దీంతో కాయలకు స్వల్పంగా డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయి. నాణ్యత కలిగిన కాయలకు డిమాండ్ బాగా ఉందని వ్యాపారులు తెలిపారు. బస్తా (లూజు) ధరలు రూ.3200 నుంచి రూ.6100 వరకు ఉన్నాయి. ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ధరలు తగ్గే పరిస్థితి లేదని సమాచారం.



పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

ముత్తుకూరు: పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యమని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయాధికారి రాజశేఖర్, ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా ఓ అండ్ ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేలటూరులోని ముసునూరువారిపాళెం హైస్కూల్లో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను ఎస్ఈఐఎల్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. పర్యావరణ అనుకూల కార్యక్రమాల నిర్వహణ, అతి తక్కువ కార్బన్ ఉద్గారాల విడుదల ద్వారా ఎస్ఈఐఎల్ సంస్థ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.



మొక్కలకు నీరు పోస్తున్న సునీల్‌కుమార్

పట్టించుకోకపోతే మాగాణి ఎడారే

• శిథిలావస్థకు చేరిన అట్టడి
• ఆందోళనలో అన్నదాతలు

మనుబోలు: మనుబోలులోని మాగాణి పొలాలకు సాగునీటిని సరఫరా చేసే అట్టడి (కండలేరు ఉప కాలువపై వంతెన) శిథిలావస్థకు చేరుకొని ప్రమాదభరితంగా మారింది. ముందుచూపుతో వ్యవహరించాల్సిన ఇరిగేషన్ అధికారులు దీన్ని పట్టించుకోవడం మానేశారు. అట్టడి ఏ క్షణంలోనైనా కూలిపోయేలా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

90 శాతం పొలాలకు సాగునీరు

మనుబోలులోని 90 శాతం మాగాణి పొలాలకు ఈ మార్గం ద్వారానే సాగునీరందుతుంది. స్థానిక పెద్ద చెరువు నుంచి పొలాలకు వెళ్లే పంట కాలువకు అడ్డుగా కండలేరు ఉప కాలువ ఉంది. పంట కాలువలోని సాగునీరు కండలేరు వాగును దాటేందుకు వీలుగా బ్రిటిష్ హయాంలోనే అట్టడిని నిర్మించారు. వంతెనపై కాలువలా ఏర్పాటు చేశారు. దీంతో నీరు కండలేరు వాగు అవతలి వైపునకు చేరుకొని తిరిగి పంట కాలువలో కలుస్తుంది.

పలు చోట్ల లీకులు

కొన్నేళ్లుగా అట్టడి శిథిలావస్థకు చేరుకోవడంతో పలుచోట్ల లీకులు ఏర్పడి సాగునీరు వృథా అవుతోంది. అసలే అంతంతమాత్రంగా ఉన్న ఈ వంతెన 2015 నవంబర్, డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో బాగా దెబ్బతినింది. ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇది కూలిపోతే మనుబోలులోని సుమారు 1200 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన నూతన వంతెనను నిర్మించేలా చర్యలు చేపట్టడంతో పాటు రబీ సీజన్లోపు లీకులకు అరికట్టేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



దెబ్బతిన్న అట్టడి



లీకులతో వృథా అవుతున్న నీరు

కొత్తగా నిర్మించాలి



బ్రిటిష్ హయాంలో నిర్మించింది కావడంతో కాల పరిమితి దాటిపోయింది. తాత్కాలిక మరమ్మతులతో ఉపయోగం లేదు. ఇది పూర్తిగా కూలిపోకముందే పక్కనే కొత్తగా బ్రిడ్జిని నిర్మించాలి. అట్టడి కూలిపోతే సాగునీరందక వెయ్యి ఎకరాలకుపైగా ఎడారిగా మారే ప్రమాదం ఉంది.
– కలికి వెంకటస్వామిరెడ్డి, రైతు, మనుబోలు

సాగునీరు వృథా అవుతోంది



చాలా ఏళ్లుగా అట్టడి శిథిలావస్థలో ఉంది. ఇది కూలిపోకముందే జాగ్రత్త వహించాలి. లీకుల కారణంగా సాగునీరు వృథా అవుతోంది. దీంతో పంట చివరి దశలో ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారాన్ని చూపాల్సిన అవసరం ఉంది.
– బొమ్మిరెడ్డి ధనుంజయరెడ్డి, రైతు, మనుబోలు

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


శివకుమార్

రుద్రూర్: నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ ప్రకృతి ఆశ్రమానికి చికిత్స నిమిత్తం వచ్చిన ఐల శివకుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై అప్పారావు గురువారం తెలిపారు. నెల్లూరు జిల్లా పల్లిపాళేనికి చెందిన శివకుమార్ గత నెల 25వ తేదీన అక్బర్ నగర్ చికిత్సాలయంలో అడ్మిట్ అయ్యాడు. మతి స్థిమితం సక్రమంగా లేనందున వారం రోజుల క్రితం ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం శివకుమార్ మామ సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గుడ్లూరు: కారు ఢీకొని రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుడ్లూరు – తెట్టు ప్రధాన రహదారిపై మామిడి చెట్లు సెంటర్ వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మాచవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ అంజయ్య పనిపై మామిడి చెట్లు సెంటర్ వద్దకు వచ్చి తిరిగి గ్రామానికి వెళ్లడానికి రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో అంజయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది అంజయ్యకు ప్రథమ చికిత్స అందించి కందుకూరుకు తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: ఓ వ్యక్తి మద్యంలో పురుగు మందు కలుపుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల కథనం మేరకు.. రూరల్ మండలంలోని గుండ్లపాళెం గ్రామంలో మడపర్తి వెంకటేశ్వర్లు (47), భార్య బాలమ్మ నివాసం ఉంటున్నారు. వెంకటేశ్వర్లు కొంతకాలంగా చెడువ్యసనాలకు బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబసభ్యులను బెదిరిస్తుండేవాడు. ఈనెల 4వ తేదీన వెంకటేశ్వర్లు వడ్డిపాళెంలో మద్యం పురుగు మందు కలిపి తాగాడు. స్థానికులు గమనించి హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం తెలిపారు.

రాపూరు డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు



మాట్లాడుతున్న హనుమంతరావు

రాపూరు: రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఈ ఏడాది నుంచి కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాపూరులో చాలా సంవత్సరాలుగా బీకాం, బీఏ కోర్సులు మాత్రమే ఉండేవన్నారు. అయితే ఈ ఏడాది నుంచి బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఈనెల 18వ తేదీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన ఫీజు కళాశాల భరిస్తుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

ఉపకారవేతనానికి విద్యార్థుల ఎంపిక

వెంకటగిరి రూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు నిర్వహించిన పరీక్షలో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ప్రిన్సిపల్ తులసిజ్యోతి గురువారం తెలిపారు. 8వ తరగతి చదివే విద్యార్థులకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ మంజూరు చేస్తుందన్నారు. తమ పాఠశాలకు చెందిన సజ్జ వెంకటనాగసాయి, సునంద, గుడతొట్టి రక్షిత, తిరుపతి మునిజస్మిత, పెట్లూరు దీపిక, కొంపల ముని, పూజిత, వెన్నెల, గౌతమ్ ర్యాంకులు సాధించి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 159
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 280
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 310
లేయర్ చికెన్	: 204



పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.77
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.30

ఫిట్‌నెస్‌పై ఫోకస్

- ఆరోగ్యంపై పెరుగుతున్న శ్రద్ధ
- జిమ్‌కు వెళ్లేందుకు అనేకమంది ఆసక్తి

నెల్లూరు సిటీ: ఒకప్పుడు జిమ్‌కు వెళ్లే వారి సంఖ్య చాలా తక్కువగా ఉండేది. అయితే కొన్ని సంవత్సరాలుగా పరిస్థితి మారింది. అధిక బరువును తగ్గించుకోవడం.. ఫిట్‌గా ఉండేందుకు అనేకమంది ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. రోజులో ఒకటి నుంచి రెండు గంటలపాటు జిమ్‌లో వ్యాయామం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు కేవలం నగరాలకు మాత్రమే పరిమితమైన ఫిట్‌నెస్ సెంటర్లు ప్రస్తుతం చిన్న పట్టణాలకు సైతం విస్తరించాయి. వీటికి మహిళలు కూడా వెళ్తున్నారు.

జిల్లాలో ఇలా..

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోనే సుమారు 50 జిమ్ సెంటర్లున్నట్లు అంచనా. ఇక ఆత్మకూరు, కావలి, కోవూరు, కందుకూరు, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాల్లో కొన్ని సెంటర్లున్నాయి. గతంలో కేవలం నగరాలకు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన జిమ్ సెంటర్లు ఇప్పుడు మండల కేంద్రాల్లోనూ ఏర్పాటవుతున్నాయి. తెల్లవారుజామున 4 గంటకే ఇవి ప్రారంభమవుతున్నాయి. ఉదయం 10 గంటల వరకు కొనసాగుతున్నాయి. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటున్నాయి. ఉదయం వేళల్లో బిజీగా ఉండే వారు సాయంత్రం వ్యాయామం చేసేందుకు సమయం కేటాయిస్తున్నారు.

నియమాలు పాటించాలి

జిమ్‌కు వెళుతున్నాం.. అయినా బరువు తగ్గడం లేదు.. ఎంత చేసినా అలానే ఉన్నానని కొందరు అంటుంటారు. అయితే ఎంత కష్టపడినా ఆహారం తీసుకునే విషయంలో నియమాలు పాటించకపోతే ఉపయోగం ఉండదు. ప్రస్తుత రోజుల్లో జంక్‌ఫుడ్ తీసుకునేవారు పెరిగిపోతున్నారు. దీంతో శరీర బరువు పెరుగుతోంది. అందువల్ల వాటికి దూరంగా ఉండాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. మద్యానికి కూడా దూరంగా ఉంటేనే అనుకున్న శరీర సౌష్టవాన్ని సాధించగలరు. ప్రొటీన్ శాతం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవకాశం ఉంటుంది.


కసరత్తులు ఎలా చేయాలో వివరిస్తున్న కోచ్

కోచ్ సూచనలు ముఖ్యం

జిమ్‌లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కండరాలు దెబ్బతినే అవకాశం ఉంది. కోచ్ సూచనల మేరకు నడుచుకుంటే ఆరోగ్యంతోపాటు శారీరక సౌష్టవం కూడా లభిస్తుంది. అయితే కొందరు యువత అత్యుత్సాహంతో కోచ్‌తో పనిలేకుండా వారికి ఇష్టం వచ్చినట్లు వ్యాయామాలు చేస్తుంటారు. దీంతో భవిష్యత్‌లో కండరాలు, నడుము నొప్పులు వచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ప్రతి జిమ్ సెంటర్‌లో కోచ్‌లను నియమిస్తున్నారు. కొత్తగా చేరిన వారికి ఎప్పుడు ఏం చేయాలో వివరిస్తున్నారు. కసరత్తులు చేస్తూ ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరిస్తున్నారు.





మహిళలకు ప్రత్యేకంగా..

శరీర బరువు తగ్గించుకోవడానికి, ఫిట్‌నెస్ కోసం జిమ్‌లకు వెళ్లే మహిళల సంఖ్య పెరుగుతోంది. గతంతో పోలిస్తే ప్రస్తుతం మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. జిమ్ సెంటర్ నిర్వాహకులు వారి కోసం ప్రత్యేకంగా మహిళా కోచ్‌లను నియమిస్తున్నారు. కొన్ని సెంటర్‌లు వారి కోసం ప్రత్యేక సమయాన్ని, గదులను కేటాయిస్తున్నాయి.

ఆసక్తి పెరుగుతోంది



యువత వ్యాయామం చేసేందుకు మక్కువ చూపిస్తున్నారు. వారికి ఏ విధంగా శరీర సౌష్టవం కావాలో తెలుసుకుని శిక్షణ ఇస్తుంటాను. కొందరు బరువు తగ్గడానికి, మరికొందరు సిక్స్ ప్యాక్ కావాలంటారు. మేము చెప్పిన విధంగా చేస్తూ.. ఆహార పద్ధతులు పాటిస్తే వారు అనుకున్నది సాధించగలరు. అదే విధంగా ఇటీవల మహిళలు కూడా ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

– వంశీ, జిమ్ నిర్వాహకుడు

సూచనల మేరకు..

ఎన్ని పనులున్నా రోజులో ఒక గంట కచ్చితంగా వ్యాయా మం చేస్తాను. ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ లభిస్తుంది. కొన్ని నెలలుగా జిమ్‌కు వెళ్తున్నాను. కోచ్ సూచనల ప్రకారం నడుచుకుంటున్నాను.

– సూర్య, విద్యార్థి

మన చేతుల్లోనే ఆరోగ్యం



ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటించకుండా, కనీస వ్యాయామం చేయకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ జిమ్ సెంటర్‌కు వెళ్తున్నాను. ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత మన చేతుల్లోనే ఉంది.

– చందన, గృహిణి

ఫిట్‌గా ఉండొచ్చు

కోవిడ్ మహమ్మారి కారణంగా చాలామందిలో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. దీంతో వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. అలవాట్లు మార్చుకుంటున్నారు. జిమ్‌కు వెళ్లడం వల్ల ఫిట్‌గా ఉండొచ్చు.

– అంజన, విద్యార్థి

వ్యాక్సిన్ వేయించుకోవాలి

రాపూరు: 18 నుంచి 60 ఏళ్లలోపు వారు టీబీ సోకకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని వేపినాపి పీహెచ్‌సీ వైద్యుడు సూర్య ధర్మేంద్ర తెలిపారు. మండలంలోని శానాయిపాళెం హెల్త్ సెంటర్‌లో గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ టీకాను వేస్తున్నట్లు చెప్పారు. ధూమపానం, పొగాకు అలవాటు ఉన్నవారు టీకా కచ్చితంగా వేసుకోవాలని సూచించారు.


వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు బహుమతుల అందజేత



రాపూరు: స్థానిక గ్రంథాలయంలో కొంతకాలంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు. విద్యార్థులకు గురువారం ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వేసవి శిక్షణా తరగతుల వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి, సృజనాత్మక విలువలను పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జీవన జాగృతి మిత్రమండలి అధ్యక్షుడు సురేష్, నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది శివకుమార్, పరుశురామ్, గ్రంథాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వెంకటేశ్వరపురంలో అగ్నిప్రమాదం

నెల్లూరు సిటీ: నగరంలోని వెంకటేశ్వరపురంలో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్వరపురంలోని పెన్నా బ్రిడ్జి ప్రాంతంలో 40 కుటుంబాలు బుట్టలు అల్లుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. వారు పూరిళ్లలో ఉంటున్నారు. బుధవారం అర్ధరాత్రి రవి, శేఖర్, గణపతి, సుబ్బమ్మ అనే వ్యక్తుల ఇళ్ల నుంచి మంటలు చెలరేగాయి. ఆయా కుటుంబాలన్నీ ఆరుబయట నిద్రిస్తున్నాయి. మంటలకు ఉలిక్కిపడి లేచి అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో రెండు పూరిళ్లు పూర్తిగా, మరో మూడు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఫ్లై ఓవర్ కింద ఉన్న పరుపులు, వెదురు గంపలు, వస్తువులు, కర్రల దుకాణాలకు మంటలు వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. అప్రమత్తమైన ప్రజలు, అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని బాధితులు గురువారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


ముఖ్య నేతలతో మాట్లాడుతున్న మేకపాటి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో గురువారం ఆయన వివిధ ప్రాంతాల పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని చెప్పారు. గెలుపోటములతో సంబంధం లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేసిన పదినెలల కాలంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. అయినా ప్రజలు ఊహించని విధంగా, ఆశ్చర్యకరంగా తీర్పునిచ్చారని విస్మయం వ్యక్తం చేశారు. ఉదయగిరిలో కచ్చితంగా విజయం సాధిస్తామని భావించామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటర్ల తీర్పును అంగీకరించాల్సిందేనన్నారు. ఉదయగిరి ప్రాంత అభివృద్ధికి మేకపాటి కుటుంబం ఎంతో కృషి చేసిందన్నారు. అధికార పక్షం ఈ ప్రాంతానికి మంచి చేసేందుకు పాటుపడితే తమ సహకారం ఉంటుందన్నారు. తాను ఓటమి చెందినా నిత్యం అందుబాటులోనే ఉంటానని భరోసా ఇచ్చారు.

ఆరోగ్య సిరి

చిరుధాన్యాల వంటలపై ప్రజలు అధికంగా మక్కువ చూపుతున్నారు. వీటిల్లో పోషకాలు ఉండడం.. ఆరోగ్యం మెరుగుపడుతుండడంతో డిమాండ్ పెరిగింది. ఈ ధాన్యాలను ఆహారంలో తీసుకోవడం ద్వారా పిల్లల్లో మంచి ఎదుగుదల ఉంటుందని, పెద్దల అనారోగ్య సమస్యలకు చెక్ పడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో వాటిని వినియోగించే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

చిరుధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్

- జిల్లాలో విస్తారంగా సాగు
- అల్పాహారం, ఇతర ఆహార పదార్థాల తయారీ
- పెరుగుతున్న విక్రయాలు



నెల్లూరు(పొగతోట): కొన్ని దశాబ్దాల క్రితం చాలావరకు చిరుధాన్యాలను పుష్కలంగా తీసుకునేవారు. రాగులు, జొన్నలు వంటి వాటితో రొట్టెలు తయారు చేసుకుని తింటూ ఆరోగ్యకరమైన జీవనాన్ని గడిపేవారు. పట్టణ జీవన శైలిలో చిరుధాన్యాల వినియోగం గణనీయంగా తగ్గి, వరి అన్నాన్నే ప్రజలు ఎక్కువగా తీసుకోవడం మొదలైంది. ఫలితంగా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం, పండించే రైతుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అనారోగ్య సమస్యలు, కోవిడ్ మహమ్మారి ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంచింది. దీంతో ఆహారం విషయంలో అనేక మార్పులు వచ్చాయి. క్రమంగా చిరుధాన్యాలకు డిమాండ్ పెరిగింది. ఇందులో జొన్నలు, సజ్జలు, రాగులు ప్రధానమైనవి. అరికెలు, సామలు, అండుకొర్రలు, ఊదలు లాంటి వాటిని సూక్ష్మ ధాన్యాలుగా పిలుస్తారు. వరి, గోధుమలకన్నా ఇవన్నీ అధికంగా పోషక విలువలను కలిగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చిరుధాన్యాల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, రక్తపోటును, గుండె సంబంధిత వ్యాధులను అదుపులో ఉంచడం, రోగ నిరోధక శక్తిని పెంచడం వంటి లాభాలున్నట్లు పరిశోధకులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం షుగర్ వ్యాధితో అనేకమంది బాధపడుతున్నారు. వీరంతా చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటున్నారు.

పెరిగిన సాగు

జిల్లాలో రెండువేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగును ఉన్నతాధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 600 ఎకరాల్లో జరుగుతోంది. కలువాయి, వింజమూరు, ఎస్‌ఆర్‌పురం తదితర మండలాల్లో చేపట్టారు. ఎకరా వరి సాగు చేసేందుకు అయ్యే ఖర్చుతో మూడు ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేసే అవకాశాలు ఉండడంతో రైతులు ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. రసాయనాలు, పురుగు మందులు అధికంగా వినియోగించి ప్రస్తుతం పంటలు పండిస్తున్నారు. చిరుధాన్యాలు పండించేందుకు నీరు అధికంగా అవసరం ఉండదు. చిన్నపాటి వర్షం పడినా చాలు. ప్రజల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులు సాగు, మార్కెటింగ్‌కు గతంలోనే ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిరుధాన్యలతో ఇడ్లీ, దోశ, ఉప్మా, పొంగలి తదితర వాటిని వండుతున్నారు. కొర్రలు, అండుకొర్రలతో రొట్టె, అప్పం, లడ్డూలు, మురుకులు, కేసరి, హల్వా తదితర పదార్థాలు చేస్తున్నారు. మిక్స్‌డ్ మిలెట్స్‌తో దోశ, ఇడ్లీలు, పొంగళ్, పులిహోర తయారు చేస్తున్నారు. నెల్లూరులోని చిల్డ్రన్స్ పార్కు, మద్రాస్ బస్టాండ్, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో చిరుధాన్యాల వంటలు లభిస్తున్నాయి. స్వీట్ షాపుల్లో ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఫుడ్ యాప్స్‌లో వీటికి అధికంగా ఆర్డర్లు పెడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.